

పల్లెలకు నిధుల కొరత

- పెండింగ్‌లో 1180 అభివృద్ధి పనులు
- రూ.30 కోట్లకు పైగా పెండింగ్ బిల్లులు
- సీసీరోడ్లు, పంచాయతీ భవనాలు, ప్రహరీ గోడలు, మరుగుదొడ్ల నిర్మాణాలకు ఆటంకాలు
- అస్తవ్యస్తంగా పల్లె ప్రగతి

నిర్మల్, జూన్ 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రస్తుతం పల్లెల పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. ముఖ్యంగా పంచాయతీరాజ్ శాఖ తీవ్రమైన నిధుల కొరతను ఎదుర్కొంటున్న కారణంగా పనులన్నీ ఎక్కడికక్కడ స్తంభించిపోతున్నాయి. ఇప్పటికే వివిధ గ్రాంట్‌ల కింద చేపట్టిన పనులు నిధుల కొరత కారణంగా అర్ధాంతరంగా ఆగిపోతున్నాయి. జిల్లాలో మొత్తం 2082 పనులకు సంబంధించి ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పనులకు గాను రూ.153.56 కోట్లతో పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ అధికారులు అంచనాలు రూపొందించారు. ముఖ్యంగా గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలు, గ్రామాల్లో సీసీ రోడ్లు, మురికి కాలువలు, మరుగుదొడ్లు, పాఠశాలల్లో కిచెన్‌షెడ్లు అలాగే ప్రహరీగోడల నిర్మాణాలతో పాటు మరికొన్ని అభివృద్ధి పనులను చేపట్టేందుకు పంచాయతీరాజ్ శాఖ అధికారులంతా ఆగమేఘాల మీద ప్రతిపాదనలు రూపొందించారు. అనుకున్నట్లుగానే పనులను సైతం ప్రారంభించారు. అయితే ఇప్పటి వరకు కేవలం 314 పనులు మాత్రమే కొనసాగుతుండగా అయితే ఇప్పటి వరకు 588 పనులు మాత్రం ఎట్టకేలకు పూర్తయ్యాయని అంటున్నారు. ఇంకా దాదాపు 1180 పనులు ఇంకా ఇప్పటికి మొదలు కాలేదు. 314 పనులకు సంబంధించి రూ.33కోట్ల65లక్షల91వేల రూపాయలను మాత్రమే వ్యయం చేశారు. సంబంధిత శాఖ ఖాతాల్లో నిధులు లేని కారణంగా పనులు చేపట్టే గుత్తేదారులు ఆ పనులను చేయలేక వెనకడుగు వేస్తున్నారు. అయితే అధికారులు ఇప్పటి వరకు మొదలుకాని 1180 పనులకు సంబంధించి గ్రామస్థులు, గుత్తేదారులకు నచ్చజెప్పుతున్నప్పటికీ వారి బడ్జెట్ ఆధారంగానే పనులు చేపడతామంటూ పేర్కొంటున్నారు. పూర్తయిన, కొనసాగుతున్న పనులకు సంబంధించి రూ.26.25 కోట్ల రూపాయలను ఆ పనులను చేపట్టిన వారికి పంచాయతీరాజ్ శాఖ చెల్లించాల్సి ఉంది. అయితే నెలలు గడుస్తున్నప్పటికి ఈ చెల్లింపులు జరగని కారణంగా ఆ పనులు చేపట్టిన వారంతా తీవ్ర ఆందోళనకు గురి కావడమే కాకుండా ప్రభుత్వంపై ఒత్తి డి తీసుకువస్తున్నారు. అయితే ఎప్పటికప్పుడు నిధులు విడుదలకాకపోతుండడంతో సంబంధిత శాఖ అధికారులు నిధులు చెల్లింపుల విషయంలోనూ నిలిచిపోయిన పనులు చేపట్టే విషయంలోనూ స్పష్టతనివ్వడం లేదంటున్నారు. నిధుల కొరతతో పల్లెల్లో అభివృద్ధి పనులను అటకెక్కుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



ఎన్ఆర్ ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు

పంచాయతీ రాజ్‌లకు 2082 పనులు మంజూరు

కాగా జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ పరిధిలో వివిధ రకాల అభివృద్ధి పనులను చేపట్టేందుకు రూపొందించిన 2082 పనులకు సంబంధించిన ప్రతిపాదనలకు ప్రభుత్వం మంజూరు ఇచ్చింది. అధికారులు ఈ 2082 పనులకు సంబంధించి రూ. 153.56 కోట్లలో అంచనాలు సైతం రూపొందించగా ఈ అంచనాలకు కూడా అప్పటి ప్రభుత్వం అంగీకరించింది. అయితే కేవలం రూ.33.65 కోట్ల పనులను మాత్రమే చేయగలిగారు. మిగతా 1180 పనులు మాత్రం ఇప్పటి వరకు మొదలుకాకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమంటున్నారు. కేవలం 588 పనులు మాత్రమే పూర్తి కాగా 314 పనులు మాత్రం నత్తనడకన కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు అధికారులు రూ.33కోట్ల65లక్షల91వేలు ఖర్చు చేసినట్లు చెబుతున్నప్పటికీ ఎక్కడ కూడా ఈ లెక్కలకు పొంతన కుదరడం లేదంటున్నారు. మొత్తం 1180 పనులు పూర్తయితేనే గ్రామీణ ప్రాంతాల్లో స్పష్టంగా అభివృద్ధి కనిపిస్తోంది. లేనట్లయితే అభివృద్ధి విషయంలో ప్రజా ఆగ్రహానికి గురి కావాల్సిన పరిస్థితులు కూడా ఏర్పడనున్నాయని అంటున్నారు.

ఉపాధి హామీకి సైతం కష్టకాలం

కాగా గ్రామీణ ఉపాధిహామీ పథకంతో పాటు జిల్లా కలెక్టర్ ప్రత్యేక నిధులతోనే ఈ పనులను చేపట్టారు. ప్రస్తుతం ఎన్ఆర్ఈజీఎస్‌లో కూడా నిధుల కటకట ఏర్పడింది. అప్పటి జిల్లా కలెక్టర్ అంచనాలు రూపొందించి ఆయా పనులకు అనుమతులు జారీ చేసినప్పటికీ నిధుల కొరత కారణంగా ముందడుగు వేయలేకపోయారంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు సంబంధించి స్టేట్ ఫైనాన్స్ నిధులు, సెంట్రల్ ఫైనాన్స్ నిధులు సైతం ప్రతీఏటా మంజూరవుతుంటాయి. నిధుల మంజూరుకు, నిధుల విడుదలకు వ్యత్యాసం ఉంటోందని, కేవలం కాగితాలపై ప్రకటనలకే నిధుల మంజూరు అంశం పరిమితమైపోతోందని పేర్కొంటున్నారు. ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో కూలీలు పెద్దసంఖ్యలో ఈ సారి పనులు చేశారు. మండుటెండలో సైతం వారు లెక్క చేయకుండా పనులను కొనసాగించారు. అయినప్పటికీ క్రమంగా నిధుల కొరత వెంటాడుతున్న కారణంగా భవిష్యత్‌లో కూడా పనులు ఎలా ముందుకు సాగుతాయోనన్న ఆందోళన సర్వత్రా నెలకొంది.

ప్రభుత్వం మారడంతోనే..

ఇటీవల బీఆర్ఎస్ పార్టీ ఓటమి చెందడంతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అప్పట్లో అభివృద్ధి పనుల కోసం విడుదల చేసిన నిధులన్నింటినీ వెనక్కి తీసుకోవడం ప్రస్తుతం పల్లెలకు శాపంగా మారుతోందని అంటున్నారు. అన్ని రకాల నిధులను ప్రభుత్వం వెనక్కి రప్పించి అప్పట్లో చేపట్టిన పనులను నిలిపి వేయించినట్లు చెబుతున్నారు. అంచనాల్లో తప్పులు జరిగాయని అలాగే ప్రజలకు అవసరం లేని చోట పనులను ప్రతిపాదించారన్న ఫిర్యాదులున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంటున్నారు. తిరిగి తమకు ప్రతిపాదనలు పంపాలని ఆ ప్రతిపాదనలకు సంబంధించి నిధులు మంజూరు చేయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందంటున్నారు. దీనికి సంబంధించి ఇటీవలే ఒక్కో గ్రామం వారీగా అత్యవసరంగా అవసరమయ్యే పనుల జాబితాను సేకరిస్తున్నారు. రాబోయే వర్షకాలంలో రోడ్లు, డ్రైనేజీలు దెబ్బ తినకుండా చూసేందుకు వాటికి ఇప్పటి నుంచే మరమత్తులు చేపట్టాలని అంటున్నారు.

బిల్లులు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే



ఈ విషయమై పంచాయతీ రాజ్ శాఖ ఈఈ శంకరయ్యను సంప్రదించగా బిల్లులు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమేనన్నారు. పూర్తయిన పనులకు సంబంధించి ఆన్‌లైన్‌లో జనరేట్ చేశామని తెలిపారు. ఆర్థికశాఖ క్లియరెన్స్ ఇస్తే నేరుగా పనులు చేపట్టిన వారి ఖాతాలో డబ్బులు జమ అవుతాయని వివరించారు.

\- శంకరయ్య, ఈఈ, పంచాయతీ రాజ్ శాఖ

ఆంజనేయస్వామి ఆలయంలో వట సావిత్రి పూజలు



మర్రిచెట్టుకు పూజలు చేస్తున్న మహిళలు

నిర్మల్ కల్చరల్, జూన్ 21 : నిర్మల్‌లోని ఆదర్శనగర్ వీరాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం వటసావిత్రి పౌర్ణమి ఉత్సవాలు నిర్వహించారు. పురాతన దేవత మర్రి వృక్షానికి మహిళలు పెద్దఎత్తున పూజలు చేశారు.



ఎడ్‌బిడ్‌లో మర్రి చెట్టుకు పూజలు చేస్తున్న దృశ్యం

ముథోల్ : మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని ఎడ్‌బిడ్, కారేగాం, చించాల, ఆష్ట, తదితర గ్రామాల్లో శుక్రవారం ఘనంగా వటసావిత్రి పౌర్ణమిని నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షబూని మర్రి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. ఇలా చేయడం వలన కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో ఉంటారని నమ్మకం.

వర్షం కోసం పూజలు



కుంటాల, జూన్, 21: కుంటాల మండలంలోని ఆయా గ్రామాలలో శుక్రవారం వర్షం కురియాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక హనుమాన్ ఆలయాల్లో వర్షాలు కురిసి పంటలు పండాలని వేడుకుంటూ పూజలు నిర్వహించారు.

మంత్రి కొండ సురేఖను కలిసిన మాజీ ఎమ్మెల్యే



మంత్రి సురేఖను కలిసి మాజీ ఎమ్మెల్యే

భైంసా రూరల్, జూన్ 21 : ముథోల్ నియోజకవర్గం మాజీ శాసన సభ్యులు విఠల్ రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో దేవాదాయశాఖ మంత్రి కొండ సురేఖను మర్యాదపూర్వకంగా కలిశారు. ముథోల్ నియోజకవర్గంలో కొన్ని దేవాలయాలు మంజూరు చేయడం జరిగిందని, వాటికి తొందరగా టెండర్లు పిలవాలని, టెండర్లు పూర్తయిన వాటికి పనులు ప్రారంభించడానికి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యేలా చూడాలని కోరడం జరిగింది. ఆయన వెంట నాయకులు షిండే ఆనంద రావు పాటిల్, రాజన్న, తదితరులు ఉన్నారు.

నీట్ పరీక్ష లీకేజీకి బాధ్యులైన వారిపై విచారణ చేపట్టాలి

- ఆందోళన కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు

నిర్మల్ అర్బన్, జూన్ 21 : నీట్ పరీక్ష లీకేజీకి బాధ్యులైన వారిపై సుప్రీం కోర్టు జడ్జిచే విచారణ చేయించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి ప్రధానిమోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు మాట్లాడుతూ... బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే లీకేజీ జరిగిందని, ఒకే పరీక్షా కేంద్రంలో 8 మందికి టాప్ ర్యాంకులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం ఆటలాడుతుందని మండిపడ్డారు. వెంటనే పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో రత్న కళ్యాణికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, ఎర్రవోతు రాజేందర్, టీపీసీసీ సభ్యులు సాద సుదర్శన్, పట్టణ అధ్యక్షుడు నాందేడపు చిన్ను, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా నూతన కలెక్టర్ అభిలాష అభినవ్‌తో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావు శుక్రవారం మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందించారు. జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలపాలని ఆకాంక్షించారు. అందుకు తమ సహకారం ఉంటుందన్నారు.

ఎన్ఎంఎంఎస్ సక్సెస్‌పై

నేడు టి- శాట్‌లో మస్కాపూర్ విద్యార్థుల లైవ్ షో

ఖానాపూర్, జూన్ 21 : మండలంలోని మస్కాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు టి - శాట్ లైవ్ షోలో పాల్గొనే అరుదైన అవకాశం దక్కింది. పాఠశాల నుండి ఇప్పటి వరకు జాతీయ ఉపకార వేతనానికి 113 మంది విద్యార్థులు ఎంపికైన నేపథ్యంలో వారి పరీక్షల అభ్యాస పద్ధతి, ఉపాధ్యాయుల బోధన విధానం తదితర అంశాలపై టి- శాట్ లైవ్ షోలో ప్రసారం నిర్వహించనున్నారు. ఈ ఏడాది సైతం మస్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుండి 19 మంది విద్యార్థులు జాతీయ ఉపకార వేతనానికి ఎంపికయ్యారు. 2023 సంవత్సరానికి గాను ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులతో పాటు పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు నరేందర్ రెడ్డి, బోనగిరి నరేందర్, కుర్ర శేఖర్, జాడి శ్రీనివాస్, వెన్నం అంజయ్య, కందూరి శ్రీనివాసులు టి- శాట్ లైవ్ షోలో పాల్గొంటారని పాఠశాల ఉపాధ్యాయులు వెన్నం అంజయ్య తెలిపారు. ఈ లైవ్ షో శనివారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

పిడుగుబాటుతో మృతి చెందిన

వ్యక్తి కుటుంబీకులకు ఆర్థికసహాయం



తానూర్, జూన్ 21 : మండలంలోని ఏల్వత్ గ్రామానికి చెందిన రాంజీరావ్ పటేల్ అనే రైతు కూలి ఇటీవల పిడుగుపాటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ప్రజాట్రస్ట్ చైర్మన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యు భోస్లే మోహన్‌రావు పటేల్ పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. రూ. 10వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యకమంలో బీజేపీ నాయకులున్నారు.

ప్రతీరోజు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తాం

- ప్రత్యేక విభాగం ఏర్పాటు
- కలెక్టర్ అభిలాష అభినవ్



కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ కల్చరల్, జూన్ 21 : ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ప్రతి సోమవారంతో పాటు ప్రతిరోజు ఫిర్యాదులను స్వీకరిస్తామని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ విడుదల చేసిన ప్రకటనలో ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు ప్రజల నుండి ఫిర్యాదు స్వీకరించేందుకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తాము చేసిన ఫిర్యాదులకు రసీదు పొందవచ్చునని అన్నారు. పురోగతిని సంబంధిత శాఖల వారీగా ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కలెక్టర్‌ను కలిసి అభినందించిన బీజేపీ నాయకులు

జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌ను శుక్రవారం బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించి అభినందించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, నాయకులు అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్, మేడిసెమ్మె రాజు, సామ రాజేశ్వర్‌రెడ్డి, సాగర్, విలాస్ సాధం, అరవింద్, అలివేలు, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

- రెడ్డి మహారాజ్ అనుగ్రహ భాషణం



కల్లూర్ మార్కండేయ ఆలయంలో రెడ్డి మహారాజ్ పూజలు

కుంటాల, జూన్, 21 : ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని రెడ్డి మహారాజ్ అన్నారు. శుక్రవారం కుంటాల మండలం కల్లూర్ గ్రామంలో గల మార్కండేయ మందిరంలో సత్సాంగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి మహారాజ్ ప్రజలకు అనుగ్రహభాషణం చేశారు. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడుచుకోవాలని అన్నారు. మానవుని జీవితంలో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక వైపు మొగ్గు చూపాలన్నారు ఈ సందర్భంగా మార్కండేయ మందిరంలో పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘననివాళి



జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

నిర్మల్ కల్చరల్, జూన్ 21 : జిల్లాకేంద్రంలో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పలు పార్టీలు ప్రజాసంఘాలు ఆయనకు నివాళులర్పించారు. జయశంకర్‌చౌక్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు మారుగొండ రాము, అక్రమ్ అలీ, పూదరి నరహరి, మొహమ్మద్ బిన్ అలీ, నహీం, దేవేందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ చైన్‌గేట్ : తెలంగాణ ప్రత్యేకరాష్ట్రం కోసం అను క్షణం పరితపించిన మహోన్నత వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్‌సార్ అని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు అన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా శుక్రవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని రూరల్ పోలీస్ స్టేషన్ సమీపంలో గల జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధనకు విద్యార్థి దశ నుండే ఉద్యమాలలో చురుకుగా పాల్గొని ప్రజలను చైతన్యపరిచిన మహనీయుడని కొనియాడారు. తెలంగాణ సాధనను కళ్లారా చూడాలని ఎంతగానో కోరుకుని చివరికి అది తీరేలోపే కన్ను మూశారన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల పితామహుడు జయశంకర్ సార్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని కోరారు.

జయశంకర్ ఆశయాలు కొనసాగించాలి

ప్రొఫెసర్ జయశంకర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేసి బంగారు తెలంగాణ కల సాకారం చేసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ యా. కృష్ణంరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధనలో జయశంకర్ పాత్ర కీలకమన్నారు. ఎంతో మందిని ఉద్యమం వైపు తీసుకెళ్లడంలో చేసిన కృషి మరువలేనిదని అన్నారు. ఆయనతో కలిసి ఉద్యమంలో పాల్గొన్న అనుభవాలు గుర్తు చేసుకున్నారు. సిరికొండ రమేష్, మార్కంటి జీవన్, తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

స్పౌస్ బదిలీల్లో దగ్గరి పాఠశాలకే ప్రాధాన్యత ఇవ్వాలి : డీఈవో

నిర్మల్ కల్చరల్, జూన్ 21 : స్పౌస్ బదిలీలు కోరుకునే ఉపాధ్యాయులు స్పౌస్ పనిచేస్తున్న దగ్గరి పాఠశాలలకే ప్రాధాన్యత ఇవ్వాలని డీఈవో రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వెబ్‌ఆప్షన్ పెట్టుకునే తేదీ నాటికి దగ్గరి పాఠశాలల తరువాతే ఇతర పాఠశాలలు ఆర్డర్‌లో పెట్టుకోవాలన్నారు. మండల యూనిట్ లేదన్నారు. అలా కాకుండా దగ్గరి పాఠశాలలను వదిలి దూర పాఠశాలలు ఎంచుకుంటే సీసీఏ రూల్స్ ప్రకారం శిక్షార్హులన్నారు. 5/8 సంవత్సరాలు పూర్తికాకుండా స్పౌజ్ పాయింట్లు వాడుకున్నట్లు దృష్టికి వస్తే శాఖా పరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. స్పౌజ్ ప్రిఫరెన్షియల్ ఉపాధ్యాయులు క్యాటగిరీలు ఉపసంహరించుకుంటే డీఈవో కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

అత్యాచార యత్నం కేసులో

ఆటోడ్రైవర్‌కు మూడేళ్ల జైలు

నిర్మల్ కల్చరల్, జూన్ 21 : భైంసా మండలానికి చెందిన ఓ మహిళపై అత్యాచారం చేసేందుకు ప్రయత్నించిన ఆటోడ్రైవర్ కాంద్ర బాలాజీ అనే నిందితుడికి మూడేళ్ల సాధారణ జైలుతో పాటు వేయి రూపాయల జరిమానా విధిస్తూ నిర్మల్ సబ్ కోర్టు న్యాయాధికారి కే. రాధిక తీర్పు వెల్లడించినట్లు కోర్టు సమన్వయ అధికారి సక్రియానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు వెల్లడిస్తూ బాధితురాలు 27 అక్టోబరు 2020న తన అన్నను చూసి తిరిగి వచ్చేందుకు మహిళ బయలు దేరింది. ఆటోడ్రైవర్ ఆమెను ఒక్కదాన్నే ఆటోలో కూర్చోబెట్టుకుని తానూర్ మండలం మాంజ్రి గ్రామ నిర్మానుష్య గుట్టల ప్రాంతానికి తీసు కెళ్లాడు. ఇది గమనించి అనుమానంతో డ్రైవర్‌ను ప్రశ్నించగా తన కోరిక తీర్చాలని బలవంతం చేయ ప్రయత్నించబోయాడన్నారు. ఆటో నుంచి క్రింద పడిన మహిళకు గాయాలయ్యాయని వేడుకున్న వినిపించుకోలేదన్నారు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. కొందరు గమనించి భైంసా ఆసుపత్రిలో చేర్పించి బాధితురాలి అన్నకు సమాచారం అందించారన్నారు. అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న అప్పటి ఎస్సై కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. శుక్రవారం పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై. రమణారావు 13 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి విచారించగా నేరం రుజువైందని తెలిపారు.

నాలాలు శుభ్రం చేయిస్తా : చైర్మన్ ఈశ్వర్

నిర్మల్ కల్చరల్, జూన్ 21 : పట్టణంలోని నాలాలు శుభ్రం చేయించే ప్రక్రియ కొనసాగిస్తామని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. శుక్రవారం ఆయన బోయవాడ, శాస్త్రినగర్ ప్రాంతాల్లో పర్యటించారు. వర్షాకాలంలో ప్రజలు ఇబ్బంది పడకుండా నాళాలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తామన్నారు. కౌన్సిలర్ లావణ్య, తదితరులు ఆయన వెంట ఉన్నారు.

మిగిలిపోయిన

పోస్టులను భర్తీ చేయాలి

నిర్మల్ కల్చరల్, జూన్ 21 : ప్రమోషన్లలో మిగిలిపోయిన పోస్టులను తక్షణం భర్తీ చేయాలని ఎస్టీయూ డిమాండ్ చేసింది. శుక్రవారం డీఈవోను కలిసిన నాయకులు పదోన్నతుల్లో ఓ ఉపాధ్యాయుడికి మూడు సబ్జెక్టులలో ప్రమోషన్ వచ్చిందని తెలిపారు. సీనియారిటీ ప్రాతిపదికన ఖాళీలు పూర్తి చేయాలని తద్వారా ఉపాధ్యాయుల కొరత అధిగమించవచ్చునని తెలిపారు. ఉపాధ్యాయులకు సకాలంలో అందేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. అధ్యక్షుడు ఎస్. భూమన్న యాదవ్, ప్రధాన కార్యదర్శి జే. లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

నీటిఎద్దడి నివారణ కోసం బోరుబావి

లక్ష్మణచాంద, జూన్ 21 : నీటి ఎద్దడి నివారణ కోసం మండలంలోని మునిపెల్లిలో శుక్రవారం బోరు బావి వేశారు. గ్రామంలో తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కాంగ్రెస్ నాయకులు కూచాడి శ్రీహరిరావు దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యపై స్పందించిన ఆయన వెంటనే బోరుబండి పంపించి బోరు వేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓడ్నాల రాజేశ్వర్, నాయకులు రాంపెల్లి రమేష్, కమల్‌కోట రాజారెడ్డి, గురాల లింగారెడ్డి, చింతకింది శేఖర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

ప్రమాణాలు పాటించని డోవ్ కేంద్రం

ఆదిలాబాద్ రూరల్, జూన్21: జిల్లాకేంద్రంలోని టీచర్స్ కాలనీలో డోవ్ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న మద్యం, మాదక ద్రవ్యాల పునరావాస (డీ-అడిక్షన్) కేంద్రం నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని తేలింది. ఈ కేంద్రాన్ని కలెక్టర్ రాజర్షిషా గురువారం ఆకస్మికంగా తనిఖీచేసి బాధితుల వివరాలు అసంపూర్తిగా ఉండడంతో తీవ్ర అసహనం వ్యక్తంచేసి కేంద్రాన్ని తనిఖీచేయాలని, జిల్లాఅంటువ్యాధుల నివారణాధికారి మిట్‌పల్లివార్ శ్రీధర్‌ను ఆదేశించడంతో ఆయన శుక్రవారం కేంద్రాన్ని పరిశీలించారు. రికార్డుల నిర్వహణ సరిగాలేదని, వాటిని ఎప్పటికప్పుడు నిర్వహించకుండా వీలున్నప్పుడల్లా రికార్డులు రాస్తున్నట్లు గుర్తించామన్నారు. కేంద్రం నిర్వహణపై కలెక్టర్‌కు నివేదిక అందజేస్తానని ఆయన తెలిపారు.

బావిలో పడి ఒకరి మృతి

ఇంద్రవెల్లి, జూన్21: బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై దుబ్బాక సునీల్, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని భీంనగర్‌కు చెందిన హన్వతే మిలింద్ (35) కొంతకాలంగా ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. పలు ఆసుపత్రుల్లో తరలించి వైద్యం చేయించినా తగ్గలేదు. ఈనెల 16న ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించి వైద్యం అందిస్తుండగా ఎవరికీ తెలియకుండా ఆసుపత్రి నుంచి ఇంటికొచ్చినట్లు తెలిపారు. ఈనెల 17న రాత్రి ఇంటినుంచి బయటకు వెళ్లిన మిలింద్ తిరిగి ఇంటికి రాలేదు. మండల కేంద్రంలో చుట్టూపక్కల, బంధువుల ఇళ్లలో గాలించిన ఆచూకీ దొరకలేదని తెలిపారు. శుక్రవారం మండలకేంద్రంలోని సమీపంలోని ఓ రైతు వ్యవసాయ బావిలో మృతదేహాన్ని గమనించిన పలువురు వ్యవసాయ కూలీలు పోలీసులకు, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్సై ఘటనాస్థలానికి చేరుకుని మిలింద్ మృతికిగల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఫిట్స్‌వచ్చి రాత్రి సమయానికి ఎవరూ లేకపోవడంతోనే బావిలో పడి ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. మృతుడి తండ్రి హన్వతే దొండిబా ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య సుజాత ఉన్నారు.

యూట్యూబ్‌లో పరిచయమై తక్కువ డబ్బులకే బైకు ఇస్తామని ఆన్‌లైన్ మోసం

బోథ్, జూన్21: మండలంలోని చింతల బోరి గ్రామానికి చెందిన ప్రఫుల్ కుమార్ అనే యువకుడికి యూట్యూబ్‌లో నందకిషోర్ అనే వ్యక్తి పరిచయమై రూ.16,500లకు హీరో కంపెనీ బైకు ఇస్తానని నందకిషోర్ చెప్పాడు. మహారాష్ట్రలోని నాగపూర్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న ప్రఫుల్‌కుమార్ నమ్మి వలలో పడ్డాడు. మొదట రూ.16,500లకు బైక్‌ను అందిస్తామని చెప్పి మొదట 7వేల ఆన్‌లైన్ స్కానర్ ద్వారా డబ్బులు వేయించుకున్నారు. తర్వాత మరో రూ.7,750 వేస్తే బండి పంపుతానని నమ్మించాడు. బైకుపై ఫైన్‌లు ఉన్నాయని, రూ.9999 వేస్తే డబ్బులు తిరిగి చెల్లిస్తామని నమ్మించడంతో ఆ డబ్బులు సైతం పంచాడు. బైక్ రావాలంటే జీఎస్టీ రూ.20వేలు చెల్లించాలని చెప్పాడు. దీంతో తాను మోసపోయినట్లు ప్రఫుల్‌కుమార్ గుర్తించి సదరు వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సెల్‌ఫోన్ పోతే సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలి : ఎస్పీ

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 21: మొబైల్ ఫోన్ పోయిన వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్‌లో లేదా సీఈఐఆర్ వెబ్‌పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం ఐపీఎస్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయంలో గత మూడు నెలల్లో జిల్లావ్యాప్తంగా వివిధ పోలీసుస్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న పది మంది బాధితుల ఫోన్లను కనిపెట్టి తిరిగి జిల్లా ఎస్పీ వారికి అందజేశారు. ఇందులో ఆదిలాబాద్‌రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో పి.సాయికిరణ్, తిప్ప గ్రామం, ఏ.మాధవి టీచర్స్ కాలనీ, ఎం.నర్సయ్య జందాపూర్, విశైలత వడూర్, ఎస్‌కే రహీం బంగారిగూడ, గణేష్ (బీహార్ నుంచి ఫోన్ రికవరి) బేల మండల పోలీసు స్టేషన్ నుంచి ఓంకార్ బేల, బి.గణేష్ బేల, బోథ్ పోలీసు స్టేషన్ నుంచి విజయ్ బాబెర, రవి ప్రహ్లాద్ నాందెడ్ మొల్లం 10 సెల్‌ఫోన్లను రికవరి చేసినట్లు తెలిపారు. కాగా సెల్‌ఫోన్లను బాధితులకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ డీసీఆర్‌బీ కె.సురేందర్‌రెడ్డి, సీఐలు కె.ఫణిదర్, శ్రీనివాస్, సైబర్‌సెల్ సిబ్బంది సంజీవ్‌కుమార్, రియాజ్, స్టేషన్ సిబ్బంది శరత్, రాంప్రసాద్, ఇస్మాయిల్, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్‌కవిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలో భారీ వర్షం

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 21: జిల్లా కేంద్రంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సాయంత్రం సమయంలో ఒకేసారి వాతావరణం చల్లబడగా ఈదురు గాలులతో పాటు ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో జిల్లా కేంద్రంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. జిల్లా కేంద్రంలోని మార్కెట్‌కు వచ్చిన ప్రజలు భారీ వర్షానికి ఇబ్బందులు పడ్డారు.

'పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి'

గుడిహత్నూర్, జూన్ 21: డ్రై డే కార్యక్రమంల భాగంగా శుక్రవారం స్థానిక పీహెచ్‌సీ వైద్య సిబ్బంది శుక్రవారం మండల కేంద్రంలో పలు కాలనీల్లో ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై ఇంటింటికి తిరుగుతూ అవగాహన కల్పించారు. వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు ఆయన ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ రవీందర్, హెచ్‌ఏలు శత్రుఘన్, కృష్ణ, ఏఎన్‌ఎం శారద, ఆశా వర్కర్లు శంకరమ్మ, తదితరులు ఉన్నారు.

జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా ముందుకు..

● మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న ● ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా సార్ వర్ధంతి ● పాల్గొన్న ఆయా సంఘాల నాయకులు


ఉట్నూర్‌లో నివాళ్లు అర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 21: తెలంగాణ ఉద్యమ భావజాల వ్యాప్తికి కృషి చేసిన ప్రొఫెసర్ జయశంకర్ సార్ కలకాలం గుర్తుంచుకునే మహోన్నతమైన వ్యక్తి అని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శుక్రవారం జయశంకర్ సార్ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని తెలంగాణ తల్లి చౌక్‌లో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్రను వివరిస్తూ చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ తెలంగాణ కోసం బాల్యం నుంచి పరితపించిన వ్యక్తి జయశంకర్ అని కొనియాడారు. స్వరాష్ట్రం కోసం తొలి, మలి ఉద్యమాల్లో కీలకంగా పాల్గొన్నారన్నారు. జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతీ కార్యకర్త ముందుకు సాగుతున్నారని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

● విశ్వబ్రాహ్మణ, స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో..

విశ్వబ్రాహ్మణ, స్వర్ణకార సంఘం నాయకులు ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ కోసం జయశంకర్ సార్ చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఈ ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు నర్సింహులు, ప్రధాన కార్య దర్శి మిసాల స్వామి, కోశాధికారి కొత్తపెల్లి దశరథ్, అశోక్, పడగంటి కిష్ట య్య, గొల్ల పెల్లి నర్సింహులు, స్వర్ణకార సంఘం నాయకులు ఉదారి నగేష్, కార్యదర్శి సత్యం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు స్వామి, సంజయ్, శ్రీనివాస్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మావల: తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్తగా, తెలంగాణ ప్రజల సాధికారత కోసం తన జీవితాన్ని సైతం అంకితం చేసిన గొప్ప వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ అని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆచార్య జయశంకర్ సార్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం జిల్లాకేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో గల జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో సుంకిడి ఎంపీటీసీ వెంకట్ యాదవ్, నలిమెల నవీన్‌రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నాగరాజు, రంజిత్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్: తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ సమీపంలో ఉన్న జయశంకర్‌చౌక్ వద్ద జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మరసుకోల తిరుపతి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం ఆయన చేసిన సేవలు సాగనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి మహేందర్, దూటరాజేశ్వర్, గోడిపల్లినర్సయ్య, రాదాబాయి, మూతిగంగాధర్, ఓమేశ్వర్, సలాం దేవరావు, ఆత్రంలక్ష్మణ్, ముంజం గంగేశ్వర్, ముంజం ఆశన్న, సూర్యకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.ఇదిలా ఉండగా బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి నిర్వహించారు. బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేశ్ ఆధ్వర్యంలో కొమురంభీం ప్రాంగణంలోని జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇందులో దూట మహేందర్, ముజీబ్, బాబాశ్యామ్, సాజిద్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం విరోచిత పోరాటం చేయడంతో పాటు తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేర్చేందుకు కృషి చేశారని ఆత్మ మాజీ చైర్మన్ మల్లెపూల సుభాష్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జయశంకర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షులు సోలంకి సత్యనారాయణ, బీసీ సెల్ అధ్యక్షులు భీమా బుచ్చన్న, పొచ్చెర గ్రామ అధ్యక్షులు పొన్నాల శమిందర్‌రెడ్డి, నాయకులు ఎస్కే జాబీర్, భీమ్‌రావు, ఖాదర్, అచ్యుతరావు, తదితరులు పాల్గొన్నారు.


ముక్రా(కె)లో అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొన్న గ్రామస్థులు

ఊరూరా ప్రపంచ యోగా దినోత్సవం

ఇచ్చోడ, జూన్, 21: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదిలాబాద్ జిల్లాలోని ఊరూరా పలు యోగా ఆసనాలు వేశారు. దీనిలో భాగంగా మండలంలోని ముక్రా(కె) గ్రామంలో గ్రామస్థులందరూ కలిసి ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచి గాడ్గె మీనాక్షి మాట్లాడుతూ.. యోగా అంటే ఐక్యత అని, మనుస్సును, శరీరాన్ని, ఆత్మను ఏకం చేస్తుందన్నారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సుభాష్, పంచాయితీ కార్యదర్శి పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు. అలాగే,

బజార్‌హత్నూర్: యోగాలో అనేక రకాలైన ముద్రల వల్ల శారీరక, మానసిక శుద్ధితో పాటు అధ్యాత్మిక లాభాలు కలుగుతాయని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని మారుమూల గిరిజన గ్రామంలోని డెడ్రాలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించి యోగా విశిష్ఠతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాస్, పంచాయితీ కార్యదర్శి సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు. అలాగే, నేరడిగొండ, తలమడుగు, సోనాల, గుడిహత్నూర్, తాంసితో పాటు పలు మండలాల్లో యోగ దినోత్సవం పురస్కరించుకుని స్థానికులు యోగ దివాస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.


తలమడుగులో మర్రి చెట్టుకు పూజలు చేస్తున్న మహిళలు

వాడవాడలా వటసావిత్రి వ్రతాలు

తలమడుగు, జూన్ 21: మండల కేంద్రంలోని లక్ష్మీవేంకటేశ్వర ఆలయంలో శుక్రవారం వటసావిత్రి పూర్ణిమను పురస్కరించుకుని ఈ సందర్భంగా వేదపండితులు నేరేళ్ల కళ్యాణాచారి ఆధ్వర్యంలో పూజలను ఘనంగా నిర్వహించారు. మహిళలు ఆలయంలోని మర్రి చెట్టుకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ వారు ప్రత్యేక ఏర్పాటు చేశారు. అనంతరం మహిళలకు వేద పండితులు వట సావిత్రి వ్రతం ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ముద్దం ఇంద్రసేనారెడ్డి, గౌరవ అధ్యక్షుడు కల్లెం తిరుపతిరెడ్డి, సతీష్, రామ్‌రెడ్డి, స్వామి యాదవ్ పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు. అలాగే మండలంలోని బరంపూర్, కజ్జర్ల, సుంకడి, ఆయాగ్రామాల్లో ఘనంగా నిర్వహించారు.

ఇచ్చోడ: మండలవ్యాప్తంగా శుక్రవారం ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని వటసావిత్రి పూజలను మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నాం. మండల కేంద్రంతో పాటు మండలంలోని ఇస్లాంనగర్, నర్సాపూర్ తదితర గ్రామాల్లో మహిళలు మర్రిచెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే, గుడిహత్నూర్, ఆదిలాబాద్ అర్బన్, జైనథ్, ఇంద్రవెల్లి, భీంపూర్, తాంసి, బోథ్‌తో పాటు పలుచోట్ల ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

న్యాయాధికారి లేక ఇబ్బందులు

● రెగ్యూలర్ న్యాయాధికారిని నియమించండి : స్థానిక ప్రజలు, అధికారులు ● నేడు జిల్లాకు పోర్టు పోలియో జడ్జి రాక


ఉట్నూర్‌లోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు

ఉట్నూర్, జూన్ 21: ఉట్నూర్ ఏజెన్సీ కేంద్రంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు రెగ్యూలర్ జూనియర్ సివిల్ జడ్జి లేకపోవడంతో ప్రజలు, అధికారులు న్యాయవాదులు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం జిల్లాకేంద్రానికి వస్తున్న హైకోర్టు పోర్టు పోలియో జడ్జి శరత్ తమ సమస్యలు పరిష్కరిస్తారని ఉట్నూర్ ప్రాంత న్యాయవాదులు ప్రజలు భావిస్తున్నారు. ఉట్నూర్ జూనియర్ సివిల్ జడ్జిగా ఉన్న తులసి దుర్గారాణిని 17 నెలల క్రితం బదిలీ చేసిన ఉన్నత న్యాయస్థానం మరో జడ్జికి పోస్టింగ్ ఇవ్వక పోవడంతో ఆదిలాబాద్‌కు బదిలీ అయిన తులసి దుర్గారాణి కొన్ని రోజుల పాటు ఇన్‌చార్జీగా వ్యవహరించారు. ఆ తర్వాత బోథ్ జూనియర్ సివిల్ జడ్జికి అదనపు బాధ్యతలు అప్పగించడంతో వారానికి ఒక్కసారి శుక్రవారం మాత్రమే బోథ్ జూనియర్ సివిల్ జడ్జి ఉట్నూర్‌కు వస్తుండడంతో కక్షిదారులతో పాటు అధికారులకు ఇబ్బందులు అవుతున్నాయని పేర్కొంటున్నారు. జిల్లాల విభజన కంటే ముందు ఉట్నూర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలో ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, జైనూర్, సిర్పూర్(యూ) లింగాపూర్ మండలాల పోలీసు స్టేషన్‌లు ఉండేవి. జిల్లాల విభజనతో ఉట్నూర్ కోర్టు పరిధిలో కేవలం నాలుగు మండలాలు ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడలు మాత్రమే ఉండడంతో కేసుల సంఖ్య తగ్గిపోయిందని ఫలితంగానే రెగ్యూలర్ జడ్జి నియామకంలో ఆలస్యం జరుగుతుందని ఉట్నూర్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు తెలిపారు. ఇటీవల హైకోర్టు పోర్టు పోలియో జడ్జి శరత్‌ని కలిసి రెగ్యూలర్ జడ్జిని నియమించాలని కోరినట్లు ఉట్నూర్ అసోసియేషన్ అధ్యక్షుడు బాపురెడ్డి, ప్రధాన కార్యదర్శి బానోతు జగన్, న్యాయవాదులు పెందుర్తి ప్రభాకర్, జమీర్‌ఖాన్, కూడెల్లి అశోక్, తదితరులు నివేదించారు. ఉట్నూర్ ఏజెన్సీలోని పోలీసులు, ప్రజలు సైతం కోర్టు పనులకు వెళ్లాలంటే బోథ్‌కు వెళ్లాల్సి వస్తుండడంతో ఇబ్బందులు అవుతున్నాయని పేర్కొంటున్నారు. ఉట్నూర్ కోర్టు పరిధిలో గుడిహత్నూర్, సిరికొండ మండలాలను చేర్చి రెగ్యూలర్ జడ్జిని నియమించాలని న్యాయవాదులు, ప్రజలు కోరుతున్నారు. ఈనెల శనివారం జిల్లా కేంద్రానికి వస్తున్న హైకోర్టు పోర్టు పోలియో జడ్జి శరత్‌ను కలిసి మరోసారి రెగ్యూలర్ జడ్జి కోసం నివేదిస్తామని ఉట్నూర్ కోర్టు న్యాయవాదులు తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

నిర్మల్ జిల్లాలో అంతర్జాతీయ యోగా దినో త్సవం



యోగాసనం వేస్తున్న కలెక్టర్



నిర్వాహకులతో కలెక్టర్ అభిలాష అభినవ్


పోలీసుల యోగాసనాలు

నిర్మల్ కల్చరల్, జూన్ 21 : యోగసాధనతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినో త్సవం సందర్భంగా శుక్రవారం దివ్య గార్డెన్‌లో ఆయుష్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగ కార్యక్రమంలో కలెక్టర్ యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రపంచం మొత్తం యోగాను అనుసరిస్తోందన్నారు. నిత్యం యోగసాధన చేస్తే మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఎన్నో వ్యాధులు నయం చేసుకోవచ్చునన్నారు. ప్రతి ఒక్కరూ నిత్యం యోగ చేయాలని పిలుపునిచ్చారు. నిర్వాహకులను కలెక్టర్ అభినందించారు. డీఈవో రవీందర్‌రెడ్డి, మహిళా సంక్షేమ అధికారి నాగమణి, వైద్యాధికారి ధనరాజ్, కమిషనర్ రాజు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాతో ప్రకృతి సిద్ధమైన శక్తి : ఎస్పీ జానకి షర్మిల

యోగసాధనతో ప్రకృతి సిద్ధమైన శక్తి లభిస్తుందని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం జిల్లా కార్యాలయంలోని ఏఆర్ క్వార్టర్‌లో నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ... ఆరోగ్యంగా ఉండాలంటే నిత్యం యోగ సాధన చేయాలన్నారు. సూర్య నమస్కారం, నడక యోగ దినచర్యలో భాగం చేసుకోవాలని సూచించారు. మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. పోలీసు సిబ్బందితో కలిసి ఎస్పీ యోగాసనాలు వేశారు. యోగ శిక్షకుడు బాలాజీ ఆధ్వర్యంలో ప్రాణాయామం, యోగాసనాలు వేశారు.

ప్రతీ ఒక్కరూ యోగాను అలవర్చుకోవాలి : డీఆర్డీవో విజయలక్ష్మి

దిలావర్‌పూర్ : యోగతోనే ఆరోగ్యం, మానసిక ప్రశాంతత కలుగుతుందని, ప్రతి ఒక్కరూ యోగాను విధిగా అలవాటు చేసుకోవాలని నిర్మల్ డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా దిలావర్‌పూర్ మండలంలోని కాల్వలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన అభివృద్ధి పనులైన అమృత్ సరోవర్ పాపిడి చెరువు పనిప్రదేశం వద్ద ఏర్పాటు చేసిన యోగ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. యోగతో అనేక ఆరోగ్య లాభాలు ఉన్నాయన్నారు. ఆరోగ్య సమస్యలు తలెత్తవని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అరుణారాణి, ఎంపీవో అజీజ్ ఖాన్, ఏపీవో దివ్య రెడ్డి, మాజీ సర్పంచ్ తిరుమల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి కళ్యాణి, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. యోగాసనాలు వేసి యోగ ప్రాముఖ్యతను చాటారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని, నిత్య జీవితంలో యోగాను అలవర్చుకుంటే ఏకాగ్రత, మానసిక ప్రశాంతత లభిస్తుందని పలువురు పిలుపునిచ్చారు. వాకర్స్ అండ్ లాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాల్గొని యోగాసనాలు వేశారు. స్థానిక రవి ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి కరస్పాండెంట్ వెంకటేశ్వర్‌రావు, డీఈవో రవీందర్‌రెడ్డి యోగాసనాలు వేశారు. యోగ సాధనతో శారీరక, మాన సిక, అధ్యాత్మిక ప్రయోజనాలు చేకూరుతాయని డీఈవో రవీందర్‌రెడ్డి అన్నారు. పీఈటీ ఖాన్, అరుణ, కృష్ణవేణి, షైక్ జాన్, తదితరులు పాల్గొన్నారు. విజయ్ హైస్కూల్‌లో నిర్వహించిన యోగ కార్యక్రమంలో విద్యార్థులు యోగాసనాలు ప్రదర్శించారు. యోగ గురువు బాలాజీ మాట్లాడు తూ... యోగ, ప్రాణాయామం, ధ్యానంతో విద్యార్థుల్లో ఏకాగ్రత లభిస్తుం దని, సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందన్నారు. చిన్నప్పటి నుండి విద్యా ర్థులు యోగాభ్యాసం చేయాలన్నారు. ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి, డాక్టర్ కూన ప్రవీణ్ కుమార్, మంచిర్యాల నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల యోగాసన ప్రదర్శన అలరించింది.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఖానాపూర్ : ప్రతిమనిషి నిరంతరం యోగ చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా మారతాడని పలువురు వక్తలు అభిప్రాయ పడ్డారు. శుక్రవారం మండలంలో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్సై లింబాద్రి సహా పోలీసు సిబ్బంది యోగాసనాలు వేశారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సై యోగ ప్రాము ఖ్యతను వివరించారు. మస్కాపూర్ హైస్కూల్‌లో యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా యోగ ప్రాముఖ్యతను వక్తలు వివరించారు. విద్యార్థులు వివిధ రకాలైన ఆసనాలను వేసి అబ్బుర పరిచారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జే. సునీత, ఇన్‌చార్జి హెచ్‌ఎం బోనగిరి నరేందర్, ఎంపీవో ఎస్. చంద్రశేఖర్, ఉపాధ్యాయులు కుర్ర శేఖర్, జాడి శ్రీనివాస్, వెన్నం అంజయ్య, షేక్ ఇమ్రాన్, శోభారాణి, దీప్తి, కార్యదర్శి కల్పన తదితరులు పాల్గొన్నారు. మండలంలోని ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సైతం యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించి విద్యార్థులకు యోగ ప్రాముఖ్యత వివరించారు.

మామడ : రోగాలను తెచ్చిపెట్టే భోగాలను విడిచి... యోగ వైపు మళ్లితేనే మీకు కలిగేది ఆనందయోగం అవుతుంది. బీజేపీ కిసాన్‌మోర్చా ప్రధాన కార్యదర్శి ఏలేటి చిన్న లింగారెడ్డి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మామడ మండల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే శారీరక వ్యాయామం తప్పనిసరి అన్నారు. యోగాసనాలతో శరీరం దృఢంగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ రోజులో అరగంట ఆయన యోగాసనాలు వేయాలన్నారు. బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు కోండ్ర రాజారెడ్డి, నాయకులు న్యాయవాది రంజిత్, నరేందర్ రెడ్డి, ఆశన్న, సురేందర్, పవన్, వెంకట రమణ, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

కుభీర్ : మండల కేంద్రం కుభీర్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో యోగాకార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి పుప్పాల పీరాజీ, ముఖ్యఅతిథి సాప పండరి, ప్రబంధకారిణి సభ్యులు సూది రాజన్న, పోషకులు ముడుగుల పరమేశ్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

తానూర్ : మండలం కేంద్రం తానూర్‌లోని వాగ్దేవి పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు యోగాసనాలను ప్రదర్శించారు. పాఠశాల డైరెక్టర్ జి.అవినాష్ మాట్లాడుతూ యోగాతో మానసికోల్లాసం పెరుగుతుందన్నారు. ముందుగా ప్రొఫేసర్ జయశంకర్‌సార్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లస్మన్న, భోజారం, సాయినాథ్, రాజన్న, షకీల్, శ్రీనివాస్, మహిళ ఉపాధ్యాయులున్నారు.



ముథోల్ : ముథోల్ మండల కేంద్రంలోని రబీంద్ర ఉన్నత పాఠశాల, అక్షర, సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలతో పాటు మండలంలోని ఫ్యూచర్ కాన్సెప్ట్ స్కూల్, శ్రీవిద్య, హైందవి, వివేకానంద పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆసనాలు వేయించారు. ధ్యానం చేయించి యోగ విశిష్టతను తెలియజేశారు. ప్రిన్సిపాళ్లు మాట్లాడుతూ... భారత దేశం ప్రపంచానికి అందించిన గొప్ప బహుమతి యోగ అని భారత దేశంలో యోగ సింధు నాగరికత కాలం నుండి విలసిల్లుతున్నదని అన్నారు. రుషులు హిమాలయాల్లోకి వెళ్లి తపస్సు చేసేవారని తెలిపారు. అలాంటి వాటిని పతంజలి మహర్షి ఏకం చేసి అష్టాంగ యోగను ప్రతిపాదించారని అవియే యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార ధారణ, ధ్యాన, సమాధి అని తెలిపారు. బుద్ధిని ఆత్మతో ఏకం చేసేది, ఆత్మను పరమాత్మలో లీనం చేసేదే యోగ అని గుర్తుచేశారు. యోగ చేయడం వల్ల గుండె. కాలేయ సమస్యలు, మధుమేహం, వెన్నెముక మొదలగు రోగాలు నయమవుతాయని రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సాయినాథ్, కరస్పాండెంట్ రాజేందర్, సుభాష్, ప్రవీణ్, సంతోష్ కుమార్, ఆనంద్, ప్రధానాచార్యులు సారథి రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


భైంసా రూరల్ : యోగాసన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం భైంసా మండలం మాటేగాం గ్రామంలో కర్ర గణపతి ఆలయంలో, కామోల్ గ్రామం సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో యోగా దినోత్సవం సందర్భంగా యోగాసనాలు, యోగా ప్రాముఖ్యత గురించి భోస్లే బాజీ రావు ఈ సందర్భంగా మాట్లాడారు.

ఆంధ్రజ్యోతి

andhrajyothy.com శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 36.8 : కనిష్ఠం 24.7

ఆదిలాబాద్ జిల్లా వార్తలు

శనివారం 22 జూన్ 2024







మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్.. హాజరైన సభ్యులు, అధికారులు

జడ్పీ మీటింగ్ వాడివేడిగా..

- జిల్లా పరిషత్ చివరి సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు, ఎంపీ
- విద్యా, అటవీ, వ్యవసాయ శాఖల పనితీరుపై సుదీర్ఘ చర్చ
- ఐటీడీఏ పీవో సమావేశానికి హాజరు కావాలంటూ బోథ్ ఎమ్మెల్యే పట్టు
- ప్రగతి నివేదికలు ఇవ్వకపోవడంపై సభ్యుల మండిపాటు
- సర్వత్రా చర్చనీయాంశమైన సమావేశంలో పాల్గొన్న బీజేపీ నేతల తీరు
- అధికారులకు ధన్యవాదాలు తెలుపుతూ ముగిసిన సమావేశం

ఆదిలాబాద్, జూన్ 21(ఆంధ్రజ్యోతి): చివరి జడ్పీ సర్వసభ్య సమావేశం వాడివేడిగా జరిగింది. పలు శాఖల పనితీరుపై సభ్యులు అధికారులను ప్రశ్నించారు. ఏళ్ల తరబడి సమస్యలకు పరిష్కారం చూపడం లేదంటూ పలువురు సభ్యులు అధికారులపై మండిపడ్డారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్య, మిషన్ భగీరథ, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమ శాఖ, వ్యవసాయ, అటవీ శాఖల పనితీరుపై సుదీర్ఘంగా చర్చించారు. మధ్యాహ్నం తర్వాత సమావేశమైన జడ్పీ సర్వసభ్య సమావేశానికి పలువురు సభ్యులు, అధికారులు డుమ్మా కొట్టడంతో నామమాత్రంగానే కనిపించింది. జిల్లాకేంద్రంలోని జడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అధ్యక్షతన జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశానికి సభ్యులతో పాటు ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యేలు అనిల్‌జాదవ్, పాయల శంకర్, కోవ లక్ష్మిలు హాజరయ్యారు. కాగా, సమావేశాన్ని ఉద్దేశించి జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ మాట్లాడారు. గడిచిన ఐదేళ్లల్లో ఎన్నో సమస్యలకు జడ్పీ సర్వసభ్య సమావేశంలో పరిష్కారం చూపడం జరిగిందన్నారు. ప్రజాప్రతినిధులు ప్రజల మధ్య ఉండి పని చేయాలన్నారు. సేవాభావంతో పని చేసిన వారికి ఎళ్లవేళలా గుర్తింపు ఉంటుందన్నారు. నూతనంగా ఎన్నికైన ఎంపీ గోడం నగేష్‌తో పాటు కలెక్టర్ రాజార్షిషాను జడ్పీటీసీ సభ్యులు, అధికారులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి అదికారులందరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. వివిధ శాఖలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. గడిచిన ఐదేళ్లలో జడ్పీ పాలకవర్గానికి సహకరించిన అధికారులందరికీ ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానాన్ని ప్రవేశపెట్టి సమావేశాన్ని ముగించారు. మొత్తానికి చివరి సమావేశం ప్రశాంతంగానే ముగిసింది. ఇందులో కలెక్టర్ రాజార్షిషా, జడ్పీ సీఈవో రత్నమాల, డీఎఫ్‌వో, డీఈవో, పీఆర్, ఆర్‌అండ్‌బీ ఈఈలు, డీఎంహెచ్‌వో, విద్యుత్ శాఖ ఎస్ఈ, రిమ్స్ డైరెక్టర్, ఆయా శాఖల అధికారులు, పలువురు జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, తదితరులు పాల్గొన్నారు.

కొన్ని శాఖల పైనే చర్చ

జడ్పీ సర్వసభ్య సమావేశంలో మొత్తం 42 శాఖల పనితీరుపై చర్చించాల్సి ఉండగా.. కొన్ని శాఖల పైననే చర్చ జరిగింది. ప్రాధాన్యత క్రమంలో చర్చించడం కనిపించింది. మొదట విద్యాశాఖ పనితీరుపై చర్చ జరగడంతో సభ్యులు పలు సమస్యలపై ఆ శాఖ ఉన్నతాధికారులను ప్రశ్నించారు. ముఖ్యంగా అమ్మ ఆదర్శ పాఠశాలల మరమ్మతు పనులు అర్ధాంతరంగానే నిలిచిపోవడంపై సభ్యులు మండిపడ్డారు. ఇప్పటి వరకు 471 పాఠశాలల్లోనే పనులు పూర్తి చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. అయితే ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో భారీ అవకతవకలు జరిగాయంటూ బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ సభ దృష్టికి తెచ్చారు. అందరూ ఆదిలాబాద్ చుట్టుపక్కల గ్రామాల్లోనే పని చేసేందుకు ఆసక్తి చూపుతున్నారని.. వెనుకబడిన బోథ్ నియోజకవర్గంలో పని చేసేందుకు ఎందుకు ఆసక్తి చూపడం లేదని? ప్రశ్నించారు. తమ నియోజకవర్గం విద్యార్థులు ఎలా చదువుకోవాలనితి? అన్నారు. ప్రతీ విషయాన్ని అధికారులు ప్రజాప్రతినిధులకు చెప్పాల్సి ఉందన్నారు. తలమడుగు మండలం సుంకిడి పాఠశాలలో ఎందుకు పనులు జరుగడం లేదన్నారు. అలాగే గతేడు గిమ్మా పాఠశాలలో గది పెచ్చులూడి ఓ విద్యార్థికి గాయాలైనా.. ఇప్పటి వరకు మరమ్మతులు చేపట్టలేదని జైనథ్ ఎంపీపీ గోవర్ధన్ అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు ఎప్పటి వరకు పూర్తి చేస్తారని ప్రశ్నించారు. అలాగే, ఉట్నూర్ మండల కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్‌లో పలు సమస్యలు ఉన్నాయని జడ్పీటీసీ చారులత రాథోడ్ అధికారుల దృష్టికి తెచ్చారు. అనంతరం అటవీ శాఖ పనితీరుపై చర్చించారు. గతేడు వానాకాలం సీజన్‌లో అటవీ జంతువుల భారీన పడి పంటలను నష్టపోయిన రైతులకు ఇప్పటి వరకు పంట నష్టపరిహారం చెల్లించ లేదని తలమడుగు జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో.. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని డీఎఫ్‌వో హామీ ఇచ్చారు. అలాగే బోథ్ ఎక్స్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన అర్బన్ పార్కులో ఏం జరుగుతుందో అధికారులు సమాచారం ఇవ్వడం లేదని బోథ్ ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తెచ్చారు. బోథ్ ఎక్స్‌రోడ్డు నుంచి మండల కేంద్రం వరకు రోడ్డు మరమ్మతులు చేపట్టాలంటూ స్థానిక జడ్పీటీసీ సభా దృష్టికి తీసుకువచ్చారు. అటవీ శాఖ అడ్డంకులు ఉన్నాయంటూ ఆర్‌అండ్‌వీ అధికారులు చెప్పడంపై మండిపడ్డారు. ఆర్‌అండ్‌బి ఈఈ పనితీరు సరిగా లేదంటూ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే పోడు భూముల సమస్యలను పరిష్కరించి ఆర్‌అండ్‌బి పరిధిలోని బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేయాలని గాదిగూడ జడ్పీటీసీ అధికారులను ప్రశ్నించారు. ఆర్‌అండ్‌బి, పీఆర్, ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులు రోడ్ల మరమ్మతులకు చర్యలు చేపట్టాలన్నారు. అటవీ శాఖ అనుమతులు లేని రోడ్ల వివరాలను చెప్పాలంటూ ఎంపీ నగేష్ అన్నారు. 2018కి సంబంధించిన ఫసల్ బీమా పంట నష్టపరిహారం ఇప్పటికి అందడం లేదన్నారు. పంటల సాగు ప్రారంభమైన రైతులకు రైతుబంధు పథకం కింద అందించే పెట్టుబడి సహాయం అందడం లేదని అలాగే రుణమాఫీ ఎప్పటిలోగా పూర్తి చేస్తారో స్పష్టతనివ్వాలని బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ ప్రశ్నించారు. దీనికి సమాధానంగా తలమడుగు జడ్పీటీసీ ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించేందుకు సానుకూలంగా ఉందని సమాధానం ఇచ్చారు. 2014లో నార్నూర్-గాదిగూడ మండలాల్లో చేపట్టిన బ్రిడ్జి రోడ్డు నిర్మాణం పనులను ఇప్పటికీ పూర్తిచేయక పోవడం ఏమిటని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి అధికారులను నిలదీశారు. గతేడు సబ్సిడీపై అందించిన కంది, సోయా విత్తనాలను రైతులకు అందించాలని తలమడుగు జడ్పీటీసీ జిల్లా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీంతో రైతులకు ఎంతో మేలు జరుగనుందన్నారు.

పీవో గైర్హాజరుపై ఆగ్రహం

జడ్పీ సర్వసభ్య సమావేశానికి ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్త హాజరుకాక పోవడంపై పలువురు సభ్యులతో పాటు బోథ్ ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. గడిచిన ఐదేళ్లలో సర్వసభ్య సమావేశానికి ఐటీడీఏ పీవోలు హాజరు కావడం లేదని జిల్లా కలెక్టర్ దృష్టికి తెరు. జిల్లాలో ఆదివాసీ గిరిజనుల సమస్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సమావేశానికి పీవో హాజరుకాకపోతే ప్రజా సమస్యలు ఎలా పరిష్కారమవుతాయన్నారు. ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాలలో ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారని అన్నారు. వెంటనే ఐటీడీఏ పీవోను పిలిపించాలని ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ డిమాండ్ చేశారు. అమాయక ఆదివాసీ గిరిజనుల సమస్యలను చెప్పుకునేందుకు అవకాశమే లేకుండా పోయిందన్నారు.

కనిపించని ప్రగతి నివేదికలు

శాఖల వారీగా సాధించిన ప్రగతి నివేదికలను అందించక పోవడంపై ఎంపీతో పాటు పలువురు జడ్పీటీసీలు అధికారులపై మండిపడ్డారు. అటవీ శాఖ పనితీరుపై చర్చ జరుగుతుండగా.. అసలు ఆ శాఖ ప్రగతి నివేదిక ఎజెండాలో లేక పోవడంతో సభ్యులు మండిపడ్డారు. దీంతో హుటాహుటిన అటవీ శాఖ సిబ్బంది ప్రగతి నివేదికను సభ్యులకు అందజేశారు. అలాగే 7, 8, 12, 17, 20, 21, 30, 31, 32, 33, 34, 36, 38వ ప్రగతి నివేదికలు ఎజెండాలో కనిపించక పోవడంపై సభ్యులు ప్రశ్నించారు. ప్రతీసారి నివేదికలను రూపొందించడంలో అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తుందన్నారు. ఇకపై నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఏదో నామమాత్రంగానే ఎజెండాను రూపొందించి అందిస్తున్నారే తప్ప.. జడ్పీ అధికారులు కూడా పరిశీలించడం లేదన్నారు. జడ్పీ అధికారుల వైఫల్యం కారణంగానే సమగ్రమైన సమాచారం సభ్యులకు అందడం లేదన్నారు. ఇప్పటి వరకు పలు సర్వసభ్య సమావేశాల్లో సభ్యులు చర్చించిన సమస్యలకు పరిష్కారం చూపినట్లు తెలపడం లేదన్నారు.

సర్వసభ్య సమావేశంలో బీజేపీ నేతలు



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నేతలు

జడ్పీ సర్వసభ్య సమావేశానికి బీజేపీ నేతలు హాజరు కావడంపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా వారిని సమావేశంలోకి అనుమతించడంతో జడ్పీ అధికారుల పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కలెక్టర్ ముందే జడ్పీ అధికారులు నిబంధనలను తుంగలో తొక్కారన్న ఆరోపణలు వస్తున్నాయి. జడ్పీ సమావేశంలో సభ్యులు, ఆయా శాఖల అధికారులు పాల్గొని పలు అంశాలపై చర్చించాల్సి ఉంటుంది. జడ్పీ సర్వసభ్య సమావేశాన్ని రాజకీయ వేదికగా మార్చారంటూ జడ్పీ అధికారులపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. జడ్పీ సీఈవో డి.రత్నమాల నిర్లక్ష్యం కారణంగానే ఇలాంటి పొరపాట్లు జరిగాయంటూ పలువురు అధికారులు చర్చించుకోవడం కనిపించింది.

అటవీ శాఖ అడ్డంకులు ఎక్కడో చెప్పండి

: గోడం నగేష్, ఎంపీ, ఆదిలాబాద్



జిల్లాలోని మారుమూల గిరిజన గ్రామాలకు మంజూరైన రోడ్డు నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. ఇదేమిటని అడిగితే అటవి శాఖ అడ్డంకులు ఉన్నాయంటూ అధికారులు చెబుతు తప్పించుకుంటున్నారు. జిల్లాలో ఎక్కడెక్కడ అటవి శాఖ అడ్డంకులు చెబుతుందో ఆర్‌అండ్‌బి, పీఆర్, ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులు సభాదృష్టికి తీసుకు రావాలి. ఏళ్ల గడుస్తున్న ఎందుకు పరిష్కారం చూపలేదో చెప్పాలి. అటవి శాఖ కింది స్థాయి సిబ్బందికి అవగాహన లేక పోవడంతో పలు సమస్యలు పరిష్కారం కావడం లేదు. అధికారులు దీని పై దృష్టి సారించాలి.

జిల్లా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

: పాయల శంకర్, ఎమ్మెల్యే, ఆదిలాబాద్



జిల్లా సమస్యలను అధికారులు మా దృష్టికి తీసుకు వస్తే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం. జిల్లాలోని ప్రధాన రోడ్లను ఆర్‌అండ్‌బికి మార్చాలి. 150 కోట్లతో రిమ్స్ సూపర్‌స్పెషాలిటి ఆసుపత్రిని నిర్మించిన ప్రయోజనం లేకుండా పోయింది. ఇప్పటికి పూర్తి స్థాయిలో వైద్యులు లేరు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల పరిస్థితి అధ్వానంగా కనిపిస్తుంది. అంతేకాకుండా కోర్టా-చనకా బ్యారేజీ నిర్మాణ పనులు పూర్తయినా.. నీటి కాలువల నిర్మాణానికి భూసేకరణ జరుగడం లేదు. కేంద్రం నుంచి నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటాం.

మా ప్రాంత విద్యార్థులు ఎలా చదువుకోవాలి

: అనిల్‌జాదవ్, ఎమ్మెల్యే, బోథ్



బోథ్ నియోజకవర్గంలో పని చేసేందుకు ఉపాధ్యాయులు ఆసక్తి చూపడం లేదు. అలాంటి పరిస్థితుల్లో మా ప్రాంత విద్యార్థులు ఎలా చదువుకోవాలి. ఉపాధ్యాయులంతా ఆదిలాబాద్ జిల్లా కేంద్రం చుట్టు పక్కల గ్రామాలకే బదిలీ పై వెళ్తున్నారు. బోథ్ నియోజక వర్గంలోని మారుమూల గ్రామాలకు బదిలీ పై రావడం లేదు. దీనిని దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్ తగు చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా ఏ ఒక్క సర్వసభ్య సమావేశానికి కూడా ఐటీడీఏ పీవో రావడం లేదు. వెంటనే పిలిపించాలి. గిరిజనుల సమస్యలకు పరిష్కారం చూపాలి.

ఆ మండలాల్లో రోడ్డు పనులు ఎన్నేళ్లు చేస్తారు?

: కోవ లక్ష్మి, ఎమ్మెల్యే, ఆసిఫాబాద్



ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని నార్నూర్, గాదిగూడ మండలాల్లో 2004లో మంజూరైన పనులు ఇప్పటికీ పూర్తికావడం లేదు. మరెన్నేళ్లు చేస్తారో? చెప్పాలి. ముఖ్యంగా ఆర్‌అండ్‌బి అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తుంది. ఆదిలాబాద్ నుంచి కెరమెరి వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు ఇంకా అసంపూర్తిగానే కనిపిస్తున్నాయి. వెంటనే ఈ పనులను పూర్తి చేస్తే ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల మధ్య దూరభారం తగ్గుతుంది. కొన్ని చోట్ల బ్రిడ్జి నిర్మాణాలను అసంపూర్తిగా వదిలేయడంతో వర్షాకాలంలో వాగులు దాటలేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సంక్షిప్త సమాచారం

కలెక్టర్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 21: జిల్లా వైద్యశాఖలో 04/2024 నోటిఫికేషన్ ప్రకారం వెలువడిన పోస్టులకు శుక్రవారం కలెక్టర్ రాజార్షిషా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో వైద్యాధికారులు 5, ఫార్మాసిస్టు 3, స్టాఫ్‌నర్సు 27, ఏఎన్ఎం 13, రేడియోగ్రాఫర్ 1, సైకియాట్రిస్టు 1, ఫిజియోథెరపిస్టు 1, వీసీసీఎం 1, ఎంవో ఆయూష్ 1 పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో జిల్లా వైద్యాధికారి డా.నరేందర్‌రాథోడ్, డీసీహెచ్ఎస్ ఉట్నూర్ డా.ఉపేందర్, ఎస్సీ సంక్షేమ అధికారిణి సునితకుమారి, ఇతర వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఒలంపిక్ డే రన్

ఆదిలాబాద్ రూరల్, జూన్ 21: ఈనెల 23న జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఒలంపిక్ డే రన్‌ను నిర్వహించనున్నట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, కన్వీనర్ పార్థసారిథి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 7గంటలకు రన్ ప్రారంభమవుతుందని తెలిపారు. జిల్లాలోని క్రీడా సంఘాల బాధ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, క్రీడా అభిమానులు సకాలంలో పాల్గొని ఒలంపిక్ డే రన్‌ను విజయవంతం చేయాలని కోరారు.

అబ్కారీ శాఖకు భారీ ఆదాయం

ఇచ్చోడ, జూన్, 21: గుడుంబా, గంజాయి, తదితర వివిధ కేసుల్లో పట్టుబడ్డ ఆరు ద్విచక్రవాహనాలకు శుక్రవారం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వై.హిమశ్రీ ఆధ్వర్యంలో వేలం వేసినట్లు అబ్కారీశాఖ సీఐ జుల్ఫికర్ అహ్మద్ తెలిపారు. ఈ వేలంపాటలో ఆరు వాహనాల విలువ ఆర్టీవో, అబ్కారీ అధికారులు రూ.51వేలు నిర్ణయించగా.. వేలంపాటలో ఆరు వాహనాలకు లక్షా 9వేలు వేలంలో రాగా.. జీఎస్టీ ద్వారా రూ.19,620 నగదు వచ్చింది. మొత్తం ఆదాయం రూ. 1,28,620 నగదు రూపంలో వచ్చినట్లు ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ వాహనాలు మొత్తం స్క్రాప్ కింద వేలం వేయడం జరిగిందని ఆయన తెలిపారు.

వేతనాలు చెల్లించాలని వినతి

ఆదిలాబాద్ రూరల్, జూన్ 21: స్టాఫ్ నర్సులుగా విధులు నిర్వహిస్తున్న తమకు వేతనాలు రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆదిలాబాద్ రిమ్స్ స్టాఫ్ నర్సులు పేర్కొన్నారు. ఈ విషయంపై రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్ చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి నెలలో విధుల్లో చేరినప్పటికీ.. ఇప్పటి వరకు వేతనాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం రిమ్స్ డైరెకర్‌కు వినతిపత్రం అందజేశారు.



ఆదిలాబాద్‌లో యోగాసనాలు వేయిస్తున్న యోగా గురువు





ఆసనాలు వేస్తున్న కలెక్టర్ రాజార్షిసా, ఎమ్మెల్యే పాయల, జిల్లా న్యాయాధికారి

నిత్యం యోగాతో ఆరోగ్య పరిరక్షణ

- జిల్లా కలెక్టర్ రాజార్షిషా
- యోగా ప్రాముఖ్యతను తెలిపిన మోదీ : ఎమ్మెల్యే పాయల
- జిల్లావ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 21: ప్రస్తుత కాలంలో ప్రతిమనిషి ఒత్తిళ్లతో జీవనం కష్టతరంగా మారుతుందని, నిత్యం యోగాలతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని కలెక్టర్ రాజార్షిషా అన్నారు. శుక్రవారం ప్రపంచ యోగ దినోత్సవం సందర్భంగా రెవెన్యూ గార్డెన్‌లో ఎమ్మెల్యే పాయలశంకర్, అధికారులతో కలిసి ఆసనాలు వేశారు. యోగ గురువు తిరుపతి పలు ఆసనాలు వేయగా అధికారులు, ప్రజాప్రతినిధులు వాటిని అనుసరించారు. అనంతరం యోగ గురువు తిరుపతిరెడ్డి, రూప తదితరులను సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం మారుతున్న కాలంలో మనిషి ఒత్తిళ్లకు గురవుతున్నారన్నారు. మానసికంగా ఆరోగ్యంగా ఉండాలంటే నిత్యం యోగ చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ యోగ ప్రాముఖ్యతను ప్రపంచ దేశాలకు తెలిపిన ఘనత ప్రధాని మోదీదని తెలిపారు. ఇదిలా ఉంటే అటు ఆఫీసర్స్ క్లబ్‌లో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యులు వై.ఓంప్రకాష్‌రెడ్డి, యోగా సాధకులు నగేష్ ఆసనాలు వేయగా వాటిని శిక్షకులు అనుసరించారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో డాక్టర్ నరేందర్‌రాథోడ్, ఆయూష్ వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, మానవ జీవితం ఒత్తిడితో కూడుకుంటాయని, వాటిని అధిగమించాలంటే ప్రతీఒక్కరు యోగా సాధనలు చేయాలని జిల్లా న్యాయాధికారి సూచించారు. జిల్లా కోర్టులో న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులతో యోగ గురువులు యోగా ఆసనాలను చేయించారు. అలాగే, అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని స్థానిక పోలీసు ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన యోగా దినోత్సవ కార్యక్రమంలో ఎస్పీ గౌస్‌ఆలం పాల్గొని సిబ్బందితో కలిసి యోగా చేశారు. ముందుగా యోగా శిక్షకుడు కానిస్టేబుల్ సామరాజు జిల్లా ఎస్పీతో సహా సిబ్బందితో సూర్య నమస్కారాలు, ప్రాణాయామము, ఆసనములు వేయించారు.

ఉట్నూర్: ప్రతినిత్యం విధులు నిర్వహిస్తూ ఒత్తళ్లకు గురవుతున్న ఉద్యోగులకు యోగ ఉపశమనం కలిగిస్తుందని జిల్లా గిరిజన సంక్షేమ శాఖడిప్యూటీ డైరెక్టర్ దిలీప్‌కుమార్ అన్నారు. శుక్రవారం యోగా డే పురస్కరించుకుని మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో నిర్వహించిన యోగ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అలాగే, ఉట్నూర్ మండల కేంద్రంలోని మాజీ ఎంపీ రాథోడ్‌రమేష్ స్వగృహంలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ప్రపంచయోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

బోథ్: అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం నిర్వహించిన యోగా శిబిరానికి బోథ్ మున్సిపల్ మెజిస్ట్రేట్ బి.హుస్సేన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అంతేగాక మండలంలోని సోనాల వివేకానంద పాఠశాలలో విద్యార్థులు యోగాసనాలు వేయడం జరిగింది. మండల కేంద్రంలోని వేదం పాఠశాలలో విద్యార్థులు యోగ ఆసనాలు వేశారు.



ఉట్నూర్‌లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సుమన్‌రాథోడ్



సోనాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



సీసీ కెమెరాకు చిక్కిన చిరుత పులి

కుచలాపూర్ అడవుల్లో చిరుత సంచారం

- భయం గుప్పిట్లో గ్రామస్థులు
- అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారుల సూచన

తలమడుగు, జూన్ 21 : తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన మండలంలోని కుచలాపూర్ అటవీ ప్రాంతంలో గత కొన్ని రోజులుగా చిరుత పులి సంచరించడంతో గ్రామస్థులు భయాందోళనలకు గురవుతున్నారు. ఇటీవల కుచలాపూర్ గ్రామానికి చెందిన కళ్యాణం ఆశన్న ఎద్దు చిరుత పులి దాడిలో మృతి చెందగా.. గతంలోనూ కూడా కుచలాపూర్ గ్రామానికి చెందిన రైతుల పశువులు, మేకలు చిరుత దాడిలో మృతి చెందాయని గ్రామస్థులు తెలిపారు. దీంతో గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు. వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు రైతులు జంకుతున్నారు. సరిహద్దు ప్రాంతంలో దట్టమైన అడవి ఉండటంతో పులులకు చెరువులకు నివాస స్థావరాలు ఏర్పరుచుకున్నాయి. కాగా అటవీ ప్రాంతంలో శాఖ అధికారులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో చిరుతపులి దృశ్యం కనబడింది. అంతేకాకుండా శాఖ అధికారులు సైతం చిరుత అడుగు జాడలు కనబడ్డాయని అటవీ శాఖ అధికారి రణధీర్ తెలిపారు. చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గ్రామస్తులు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. అడవి ప్రాంతానికి వెళ్లే వారు గుంపులుగా వెళ్లాలని సూచించారు.

'ప్రజలతో సత్సంబంధాలు ఏర్పర్చుకోవాలి'

గుడిహత్నూర్, జూన్ 21: ప్రజలతో పోలీసులు సత్సంబంధాలు ఏర్పరుచుకోవాలని ఎస్పీ గౌస్ అలం అన్నారు. శుక్రవారం సాయంత్రం ఎస్పీ మండలంలో పర్యటించారు. మొదటగా మండలంలోని ఉమ్రి(బి) రామాలయాన్ని సందర్శించారు. ఆలయ పూజారి అర్జున్‌శాస్త్రి మహరాజ్ ఎస్పీని శాలువాతో సన్మానించారు. అక్కడి విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. నమోదైన కేసుల విషయంలో పురోగతి గురించి ఎస్సై సయ్యద్ ఇమ్రాన్‌ను అడిగి తెలుసుకున్నారు. పోలీసులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించాలి : జూడాలు

ఆదిలాబాద్ రూరల్, జూన్ 21: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించో కోరుతూ ఆదిలాబాద్ రిమ్స్ జూడాలు శుక్రవారం నల్ల దుస్తులు ధరించి నిరసన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చి మూడు రోజులైనా స్పందన లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విధులు నిర్వహిస్తూనే నిరసనలు కొనసాగించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే సమ్మెకు వెళ్లాల్సి వస్తుందని జూడాలు స్పష్టం చేశారు.